## కమిషనర్ వైఖరి మారాలి : సిఐటియు

**ప్రజాశక్తి - కడప అర్బన్**

లక్ష్యం పేరుతో కడప కార్పొరేషన్‌లో పనిచేస్తున్న చిన్న స్థాయి ఉద్యోగులను పెనాల్టీ కట్టాలని వేధించే ఆలోచన కడప కార్పొరేషన్ కమిషనర్ వెంటనే మానుకోవాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నగరంలో ఉద్యోగులను వేధించడాన్ని ఖండిస్తున్నామని తెలిపారు. ఉద్యోగులను అసభ్యంగా, ఆ గౌరవంగా, యూజ్లెస్ ఫెలో అంటూ సంబోధించడం, మాట్లాడడం, కొందరిని కొడతానని చెప్పడం, ఆవిధంగా ప్రవర్తించడం సరికాదని పేర్కొన్నారు. కడప చరిత్రలో ఎవ్వరు చేయలేదని తెలిపారు. ఇప్పటికైనా కమిషనర్ వైఖరి మార్చుకోవాలని పేర్కొన్నారు. కడప నగరంలో జరుగుతున్న పరిణామాలపై జిల్లా అధికారులు విచారించి ఉద్యోగులపై పెనాల్టీ పద్ధతి, బెదిరింపులు లేకుండా చూడాలని తెలిపారు.

# మెజార్టీల పైనే పందేలు!

### బూత్‌లు, మండలాల వారీగా మెజార్టీల మదింపు
### షర్మిల గెలుపుపైనా పందేలు

**ప్రజాశక్తి - కడప ప్రతినిధి**

జిల్లాలో పందేల జోరు పతాక స్థాయికి చేరుకుంది. సార్వత్రిక ఎన్నికల బరిలో నిలిచిన వైసిపి, టిడిపి, కాంగ్రెస్ అభ్యర్థులు సాధించే మెజార్టీలపై బెట్టింగులు పెద్దఎత్తున నడుస్తున్నాయి. జిల్లాలోని ఆయా నియోజకవర్గాల పరిధిలోని గ్రామాలు, పంచాయతీలు, పోలింగ్‌బూత్‌ల ఆధారంగా ఏ పార్టీకి మెజార్టీ ఎంత మెజార్టీలను సేకరించి, దాని ఆధారంగా బెట్టింగులకు పాల్పడు తున్నారు. వైఎస్ఆర్ జిల్లాలో ఏడు, అన్నమయ్య జిల్లాలో ఆరింటిని కలిపితే మొత్తం 13 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. కడప జిల్లాలో 2,035 పోలింగ్ బూత్‌లు, అన్నమయ్యలో 1,604 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. సార్వత్రిక ఎన్నికలు నువ్వా నేనా అనే రీతిలో సాగిన నేపథ్యంలో ఎవరి మెజార్టీ ఎంత అనే అంశంపై నాయకులు గణాంకాల సేకరణపై దృష్టి సారించారు. జిల్లాలోని ఏగ్రామంలో ఎవరికి ఎంత, పంచాయతీల ఎవరిది మెజార్టీ, పోలింగ్ బూత్‌ల ఆధిక్యం ఎంత వెరసి మండలంలో ఎవరికి మెజార్టీ ఎంత అనే అంచనాల ఆధారంగా మెజార్టీలను గణించే పరిస్థితి కనిపిస్తోంది. వైఎస్ఆర్, అన్నమయ్య జిల్లాలోని 13 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పులివెందుల మినహా మిగిలిన నియోజకవర్గాల్లో ఏ పార్టీ అభ్యర్థి గెలుస్తారో కచ్చితంగా చెప్పలేని పరిస్థితి కనిపిస్తోంది. ఇటువంటి సందిగ్ధ పరిస్థితుల్లో బెట్టింగురాయుళ్లు చెలరేగిపోతున్నారు. ఇదే పరిస్థితి మే నెలాఖరు వరకు కనిపించే అవకాశం ఉంది. జూన్ ఒకటి నుంచి మరో రకమైన పోటీ నెలకొనే పరిస్థితి కనిపిస్తోంది. జిల్లాలో ప్రధాన రాజకీయ పార్టీలు వైసిపి, టిడిపి, కడప పార్లమెంట్‌పై వైఎస్ షర్మిల గెలుపు అవకాశాలపై పందేల జోరు కొనసాగుతోంది. పార్లమెంట్ పరిధిలోని పులివెందుల మొదలుకుని మిగిలిన ఆరు నియోజకవర్గాల్లో ఎక్కడ ఎంత మెజార్టీ లభించే అవకాశం ఉందనే అంచనాల బేరీజు వేసుకుని పందేలు కాస్తుడడం గమనార్హం.రూ.లక్ష మెజార్టీకి రూ.లక్షన్నర నుంచి రూ.మూడు లక్షల వరకు ఇస్తామనే పద్ధతిలో బెట్టింగులు సాగుతుండడం గమనార్హం. ఉమ్మడి జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో ఫలానా పోలింగ్ బూత్‌లో కూటమికి మెజార్టీ, ఫలానా పోలింగ్ బూత్‌లో వైసిపికి మెజార్టీ వస్తుందనే అంచనాలతో పందేలకు పాల్పడుతున్నారు. ఇలా ప్రతి నియోజకవర్గంలో రూ.లక్ష నుంచి రూ.10 లక్షల వరకు పందేల జోరు కొనసాగుతోంది. మధ్యవర్తుల సహకారంతో ప్రామిసరీ బాండ్లు రాయించుకునే పరిస్థితి కనిపిస్తోంది. ఈ నెల 13న పోలింగ్ జరిగిన సంగతి తెలిసిందే. జూన్ నాలుగున కౌంటింగ్ జరుగనుంది. పోలింగ్ నుంచి కౌంటింగ్ వరకు 20 రోజుల వ్యవధిలో భారీ ఎత్తున బెట్టింగులకు పాల్పడిన పరిస్థితి కనిపిస్తోంది. వైఎస్ఆర్, అన్నమయ్య జిల్లాల్లో కడప, కమలాపురం, ప్రొద్దుటూరు, మైదుకూరు, రాయచోటి, రాజంపేట నియోజకవర్గాల్లో ఎక్కువగా కనిపిస్తోంది. సార్వత్రిక ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థుల గెలుపోటములపై సామాన్యులు సైతం ఆసక్తి కనబరుస్తున్నారు. 2024-25 అకడమిక్ ఇయర్ జూన్ మాసంతో మొదలవుతున్న నేపథ్యంలో పిల్లల చదువులు, ఖరీఫ్ సీజన్‌లో విత్తనాలు, ఎరువులు ఇతర అవసరాలు పెరగనున్న నేపథ్యంలో సామాన్యుల కుటుంబాల్లో ఆందోళన కనిపిస్తోంది.

# మొండి బకాయిలపై రెడ్ నోటీసులు

### - జిల్లా విద్యుత్ శాఖ అధికారి ఎస్.రమణ

**ప్రజాశక్తి - కడప**

విద్యుత్ బకాయిలు అధిక మొత్తంలో పెండింగ్‌లో ఉన్నాయి, మొండి బకాయిలు ఉన్నవారికి రెడ్ నోటీసులు జారీ చేసి నిబంధన ప్రకారం వారి మీటరు శాశ్వతంగా తొలగించి కోర్టులో దావా వేసి చట్టరీత్యా చర్యలు తీసుకుని విద్యుత్ బకాయిలు వసూలు చేయాలని జిల్లా విద్యుత్ శాఖ అధికారి ఎస్. రమణ ఆదేశించారు. సోమవారం విద్యుత్ బకాయిలపై అకౌంట్స్ విభాగం వారితో కడప విద్యుత్ భవన్‌లోని తన చాంబర్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఇ మాట్లాడుతూ విద్యుత్ బకాయిలు అధిక మొత్తంలో పెండింగ్‌లో ఉన్నాయన్నారు. సంస్థ నెలరోజుల ముందు విద్యుత్ కొనుగోలు చేసి వినియోగదారులకు సరఫరా చేస్తున్నామన్నారు. విద్యుత్ బకాయిల వసూళ్లలో రాజీ వద్దని, దయ చూపించే స్థితిలో తాము లేమని బకాయిల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. విద్యుత్ బకాయిలు చెల్లించని వారి కనెక్షలను తొలగించాలని ఆదేశించారు. మొండి బకాయిలు ఉన్నవారికి రెడ్ నోటీసులు జారీచేసి నిబంధన ప్రకారము వారి మీటరు శాశ్వతంగా తొలగించి కోర్టులో దావా వేసి చట్టరీత్యా చర్యలు తీసుకుని విద్యుత్తు బకాయలు వసూలు చేయాలని సూచించారు.ఉమ్మడి వైయస్సార్ జిల్లాలో మొత్తం రూ. 54. 47 కోట్ల బకాయిలు పేరుకుపోయ్యాయని పేర్కొన్నారు. వీటిని వసూలు చేస్తేనే మనుగడ ఉంటుందని తెలియజేశారు. నెలవారి లక్ష్యాలను అధిగమించాలని ఆదేశించారు. సమావేశంలో సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ మధు కుమార్, అకౌంట్ ఆఫీసర్ మల్లికార్జున, ఎఎఒ, జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్లు, ఎలక్ట్రిసిటీ డిప్యూటీ తహశీల్దార్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న విద్యుత్ ఎస్ఇ రమణ

# నేటి నుంచి అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నీ

మైదానాన్ని సిద్ధం చేస్తున్న నిర్వాహకులు

**ప్రజాశక్తి - కడప**

జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 28 నుంచి కడపలోని కెఎస్ఆర్ఎం, కెఒఆర్ఎం క్రికెట్ మైదానాలలో ఎసిఎ సౌత్ జోన్ సీనియర్ మెన్స్ వన్డే అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం కానుంది. ఈ టోర్నమెంటులో ఆంధ్ర సౌత్ జోన్‌కు చెందిన కడప, కర్నూలు, చిత్తూరు, నెల్లూరు, అనంతపురం జట్లు పాల్గొంటున్నాయి. లీగ్ పద్ధతిలో మ్యాచ్‌లు జరుగనున్నాయి. టోర్నమెంట్‌లో పాల్గొనే ఐదు జిల్లాల జట్ల క్రీడాకారులకు, మ్యాచ్ అఫీషియల్స్‌కు, కోచ్, మేనేజర్లకు కడప జిల్లా క్రికెట్ అసోసియేషన్ అన్ని వసతి ఏర్పాట్లను సిద్ధం చేసింది. అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నమెంట్‌కు మైదానాలను జిల్లా క్రికెట్ అసోసియేషన్ సిద్ధం చేసింది. అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది. క్రికెట్ మైదానాలను ఆటకు అనువుగా క్యూరేటర్లు బాలరాజు, హరి సిద్ధం చేశారు. క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా, ఆటకు అణువుగా, ఆట సజావుగా జరిగేందుకు పిచ్, అవుట్ ఫీల్డ్ ను క్యూరేటర్లు, గ్రౌండ్స్ మెన్లు సిద్ధం చేశారు. టోర్నమెంట్ ప్రారంభం మొదటి రోజు మంగళవారం కెఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో అనంతపురం-కడప జట్ల మధ్య, కెఒఆర్ఎం క్రికెట్ మైదానంలో చిత్తూరు-కర్నూలు జట్ల మధ్య మ్యాచ్‌లు జరుగనున్నట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎ. రెడ్డి ప్రసాద్ తెలిపారు.

# కౌంటింగ్ పూర్తయ్యే వరకూ అప్రమత్తంగా ఉండాలి

**ప్రజాశక్తి - కడప అర్బన్**

సార్వత్రిక ఎన్నికల పోలింగ్ అనంతరం ఇవిఎం బాక్స్‌లను జిల్లా కేంద్రంలోని రిమ్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న మౌలానా అజాద్ ఉర్దూ నేషనల్ యూనివర్సిటీలో ఏర్పాటు చేశారు. స్ట్రాంగ్ రూమ్‌ల భద్రతా ఏర్పాట్లను సోమవారం ఎస్‌పి సిద్ధార్థ్ కౌశల్ పరిశీలించారు. అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద విధులు నిర్వహిస్తున్న అధి కారులకు, సిబ్బందికి దిశా నిర్దేశం చేస్తూ కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యేంతవరకు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు ఆస్కారం లేకుండా పటిష్ట భద్రతను కల్పించాలని ప్రతి ఒక్క సిబ్బంది, అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. కార్యక్ర మంలో అడిషనల్ ఎస్‌పి ఎస్.ఎస్.వి కృష్ణారావు, కడప డిఎస్‌పి షరీఫ్, ఎఆర్ డిఎస్‌పి మురళీధర్, డిటిసి డిఎస్‌పి రవికుమార్, స్పెషల్ బ్రాంచ్ డిఎస్‌పి సుధాకర్, రిమ్స్ పిఎస్ సిఐ కె. రామచంద్ర, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్‌పి సిద్ధార్థ్ కౌశల్

**శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే గృహనిర్బంధం**

2024 సార్వత్రిక ఎన్నికలలో నేరాలకు పాల్పడ్డ 40 మందిపై ఎస్‌పి సిద్ధార్థ్ కౌశల్ ఉక్కుపాదం మోపారు. 40 మందిపై రౌడీ షీట్లు ఓపెన్ చేసినట్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల ఎన్నికల నేరాలకు పాల్పడ్డ వారిపై నాన్ బెయిలబుల్ సెక్షన్ల కింద కేసులు నమోదు చేయడంతో పాటు రౌడీ షీట్లు ఓపెన్ చేయనున్నట్లు పేర్కొన్నారు. కౌంటింగ్ నేపథ్యంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అవకాశం ఉన్న వారిని గృహ నిర్బంధం చేయడంతో పాటు కొందరిని జిల్లా బహిష్కరణ చేసేందుకు ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. కౌంటింగ్ సందర్భంగా, అనంతరం ఎవరైనా నేరాలకు పాల్పడినా, శాంతిభద్రతలకు భంగం కలిగించినా సంబంధిత కఠినమైన సెక్షన్ల కింద కేసులు నమోదు చేయడంతో పాటు, రౌడీ షీట్లు తెరుస్తామని హెచ్చరించారు.

# రోజూ ఆరు టన్నుల తడి చెత్తను సేకరించాలి

ఇంజినీరింగ్ అధికారులకు సూచనలిస్తున్న కమిషనర్

**ప్రజాశక్తి - కడప అర్బన్**

కమిషనర్ జి.సూర్య సాయి ప్రవీణ్ చంద్ మార్నింగ్ విసిట్‌లో భాగంగా పుట్లంపల్లి ఎన్‌సిసి, ఎంఆర్ఎఫ్, ఇండస్ట్రీయల్ ఎస్టేట్, ఉక్కాయపల్లి గార్బేజ్ ట్రాన్‌ఫర్ స్టేషన్ ఆకులవీది, వినాయకనగర్, జిటిఎస్‌ను శానిటేషన్, ఇంజినీరింగ్ విభాగా అధికారులతో కలిసి పరిశీలించారు. పుట్లంపల్లి ఎన్‌సిసి ముందు భాగంలో వేసినటువంటి కంపోస్ట్ శుభ్రం చేసే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. వారం రోజులుగా ప్రతి జోన్ నుంచి వచ్చినటువంటి తడి, పొడి చెత్త వివరాలను పరిశీలించారు. తడి చెత్త సేకరణ రోజూ 6 టన్నులకు తగ్గకుండా సేకరించాలని అధికారులకు సూచించారు. విద్యుత్ బల్బులు ఏర్పాటు చేసే విధంగా చర్యలు చేపట్టాలని ఇంజినీరింగ్ విభాగానికి తెలియజేశారు. గోశాల నుంచి కౌడంగ్ ఎంసిసికి తీసుకొచ్చే విధంగా చర్యలు చేపట్టాలని శానిటేషన్ విభాగ అధికారులను ఆదేశించారు. షడ్డర్ మిషన్‌లో చేయాల్సిన మార్పులను వెంటనే చేయాలని పేర్కొన్నారు. కంపాక్టర్ బిన్స్ ఎప్పటికప్పుడూ మరమ్మతులు చేయించే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎంఆర్ఎఫ్ ప్లాంటును పరిశీలించి వెట్ వేస్ట్ రీసైకిల్ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. బేలింగ్ మిషన్, ఇతర మిషనరీస్ వెంటనే ఆర్డర్ పెట్టుకునే విధంగా చర్యలు చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఉక్కాయపల్లి జిటిఎస్ గంబుషియా ఫిష్ ట్యాంక్‌లను పరిశీలించి ట్యాంకుల అడుగు భాగాన మట్టి ఏర్పాటు చేసి లోటస్ ప్లాంట్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. వర్మి కంపోస్ట్ ప్లాంట్‌కు వాటర్ కనెక్షన్, త్రీఫేస్ ఎలక్ట్రికల్ పవర్ కనెక్షన్ ఏర్పాటు చేయాలని చెప్పారు.

## బ్రౌన్ గ్రంథాలయానికి పుస్తకాలు బహూకరణ

**ప్రజాశక్తి - కడప అర్బన్**

పుస్తకాలు అందజేస్తున్న దాతలు

అనంతపురం ప్రభుత్వ పురుషుల కళాశాల జంతుశాస్త్ర విభాగం అధ్యక్షులు జి.లక్ష్మీ నరసింహ ప్రసాద్, కడప ఎస్‌కెఆర్ అండ్ ఎస్‌కెఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.సలీం బాషా, అనంతపురం ప్రభుత్వ పురుషుల కళాశాల ఇంగ్లీషు అధ్యాపకులు ఎస్.ఇ.అహ్మద్, తంగేడుకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ఆర్.మనోహర్ నాయక్‌తో కలసి సోమవారం 60 పుస్తకాలను సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలోని గ్రంథాలయ సహాయకులు జి.హరిభూషణరావు, సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రికి అందజేశారు. ఈ సందర్భంగా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య తప్పెట రామప్రసాద రెడ్డి మాట్లాడుతూ జి.లక్ష్మీ నరసింహ ప్రసాద్ బహూకరించిన అమూల్యమైన గ్రంథాల్లో సంస్కృత మహాభారతం (6 భాగాలు), నా కోరా రాతలు, భాగవత సప్తాహం, ముగ్గురు సుందరుల కథ (సుందరకాండ రహస్యాలు), శ్రీదేశిక ప్రబంధమ్, పునర్జన్మ ఉన్నట్టా, లేనట్టా?, వేదములు, కుట్ర, శ్రీ సద్గురు రచనా వైభవం, నా జీవన యానం, పరతత్త్వ పరిశోధన, పెన్నేటిపాట, దశావతారాలు, శ్రీవిష్ణుపాదాది కేశాంత స్తోత్రమ్ ఉన్నాయని చెప్పారు. గ్రంథాలయానికి పుస్తకాలను బహూకరించిన జి.లక్ష్మీ నరసింహ ప్రసాద్‌ను వైవీయూ విసి చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి.వెంకటసుబ్బయ్య అభినందించారు.

## కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు

**కడప అర్బన్ :** ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. సోమవారం మాథ్స్, సివిక్స్ మొదటి సంవత్సరం జనరల్ అభ్యర్థులు 7,901 పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 7559 మంది హాజరయ్యారు. 342 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ కొర సంబంధించి 2,222 మంది హాజరు కావాల్సి ఉండగా 2122 మంది హాజరయ్యారు. వందమంది గైర్హాజరయ్యారు. ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 406 మంది పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 382 మంది హాజరయ్యారు. 24 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ కోర్స్ సంబంధించి 228 మంది హాజరు కావలసి ఉండగా 214 మంది హాజరయ్యారు. 14 మంది గైర్హాజరయ్యారు.

**ప్రశాంతంగా 'పది' పరీక్షలు :** పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా కొనసా గుతున్నాయి. సోమవారం ఇంగ్లీష్ పరీక్షకు 16 సెంటర్లను ఏర్పాటు చేశారు. 615 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 247 మంది హాజరయ్యారు. 368 మంది గైర్హాజరయ్యారు. ఫ్లయింగ్ స్క్వాడ్ 8 సెంటర్లను పరిశీలించారు.

## డిగ్రీ పరీక్షల మూల్యాంకన కేంద్రం తనిఖీ

**ప్రజాశక్తి - కడప అర్బన్**

యోగి వేమన విశ్వవిద్యాలయం డిగ్రీ పరీక్షల సమాధాన పత్రాల మూల్యాంకన కేంద్రాన్ని విసి ఆచార్య చింతా సుధాకర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మూల్యాంకన విధులకు హాజరైన అధ్యాపకులతో మాట్లాడుతూ సౌకర్యాలపై ఆరా తీశారు. సకాలంలో సమాధాన పత్రాలు దిద్దే ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. క్షుణ్ణంగా ఒకటికి రెండుసార్లు పరిశీలించి మార్కులు ఇవ్వాలని సూచించారు. ప్రతిభకు న్యాయం జరగాలన్నారు. పరీక్ష ఫలితాల విడుదల మీద ఆధారపడి ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ రెగ్యులర్‌గా విధులకు హాజరుకావాలని కోరారు. మూల్యాంకనం వైవీయూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ ఎన్.ఈశ్వర్ రెడ్డి పర్యవేక్షణలో కొనసాగుతోంది.

## జయరాజుకు ఆహ్వానం

**ప్రజాశక్తి - కడప అర్బన్**

యోగి వేమన విశ్వవిద్యాలయంలోని భూ విజ్ఞానశాస్త్ర ఆచార్యులు ఎన్. జయరాజుకు స్వీడన్‌లోని నోర్కోపింగ్‌లో ఈ నెల 27 నుంచి 30 వరకు నిర్వహించే 8వ ప్రపంచ వాతావరణ సంస్థ సదస్సుకు కావాలంటూ ప్రతినిధుల నుంచి ఆహ్వానం అందింది. ఆచార్య జయరాజు భారతదేశంలోని బంగాళాఖాతం, హిందూ మహాసముద్రం ఉష్ణ మండల వాతావరణ వైవిధ్యం అనే అంశంపై సదస్సులో పత్ర సమర్పణ చేయనున్నారు. ప్రపంచంలోని పలు ప్రాంతాల నుంచి పరిశోధకులు, విషయ నిపుణులు హాజరుకానున్నారని వివరించారు. ఈయన ఇప్పటికే 70 దేశాలలో క్షేత్ర సందర్శన చేసి పరిశోధన పత్రాలు సమర్పించారు. అనేక అంతర్జాతీయ జర్నల్స్ లో ఈయన రాసిన పరిశోధన పత్రాలు ప్రచురితమయ్యాయి.

## మోడీపై జీవితకాలపు నిషేధం విధించాలి

**ప్రజాశక్తి - కడప**




సమావేశంలో మాట్లాడుతున్న అలీఖాన్

భారతదేశంలోని ముస్లిం మైనార్టీలే లక్ష్యంగా వారిని కించపరుస్తూ మత విద్వేష వ్యాఖ్యలు చేసిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఎన్నికల్లో పోటీ చేయకుండా జీవితకాలం నిషేధం విధించాలని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మైనార్టీ విభాగపు ఉపాధ్యక్షుడు పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్ కేంద్ర ఎన్నికల సంఘానికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సోమవారం కడప జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రాతినిధ్యం వహిస్తున్న భారతీయ జనతా పార్టీ ఎన్నికల గుర్తింపును కూడా కేంద్ర ఎన్నికల సంఘం వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల బీహార్ రాష్ట్రంలోని పాటలీపుత్రం లోక్‌సభ నియోజకవర్గంలో జరిగిన బహిరంగ సభలో ప్రధాని నరేంద్ర మోడీ ప్రసంగిస్తూ ముస్లిం ఓట్ల కోసం ఇండియా కూటమి ముజర అనగా వేడుకల్లో ఆహుతులను ఉల్లాసపరిచే నృత్యం చేసే పని చేసినప్పటికీ తనకు అభ్యంతరం లేదని వ్యాఖ్యానించడం పై కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. అలాగే ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసి రిజర్వేషన్ల వాటాను ఇండియా కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే ముస్లిములకు కేటాయిస్తుందని మత విద్వేషపరమైన వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. కేవలం హిందూ, ముస్లింలంటూ మత ప్రాతిపదికన ఎన్నికల ప్రచారం చేయడమే కాకుండా ఎన్నికల కోడ్ కూడా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఉల్లంగించారని ఆరోపించారు. అనుచిత వ్యాఖ్యలు, విద్వేష పూరిత ప్రసంగాలు, మతాల మధ్య చిచ్చుపెట్టే ప్రసంగాలు, రెచ్చగొట్టే మాటలు, వక్ర భాష్యం వంటి అభియోగాలు మోపుతూ చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో పిసిసి ఆర్గనైజింగ్ సెక్రెటరీ వెంకటరమణారెడ్డి కాంగ్రెస్ పార్టీ ఒబిసి జిల్లా చైర్మన్ చిన్న కులాయప్ప పాల్గొన్నారు.

## వైవీయూ భవనాలిస్తే అడ్డుకుంటాం

**ప్రజాశక్తి - కడప అర్బన్**

వైవీయూ భవనాలను ఆర్కిటెక్చర్ యూనివర్సిటీకి ఇస్తే అడ్డుకుంటామని పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షులు అంకన్న హెచ్చరించారు. సోమవారం విసి సుధాకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అంకన్న మాట్లాడుతూ పరిశోధనల్లో అత్యుత్తమంగా ఎదిగే వైవీయూకు అభివృద్ధి నిరోధకాలుగా మారవద్దని కోరారు. ఆర్కిటెక్చర్ రిజిస్ట్రార్ ఈ.సి. సురేంద్రనాథ్ రెడ్డి ప్రస్తుత ప్రభుత్వం అండ ఉందని వైవీయూ అధికారుల పై ఒత్తిడి తీసుకు వచ్చి ప్రధాన పరిపాలన భవనాన్ని, ఇతర భవనాలను లాక్కోవడానికి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. వైవీయూ అధికారులు మాత్రం జీ హుజూర్ అంటూ భవనాలను అప్పగించేందుకు కమిటీని నిస్సిగ్గుగా ఏర్పాటు చేశారని ఆరోపించారు. వైవీయూ పాలకమండలిలో చర్చించ కుండా, ప్రభుత్వ అనుమతి లేకుండా కమిటీ ఎలా వేస్తారాని ప్రశ్నించారు. ఆర్కి టెక్చర్ రిజిస్ట్రార్ తమ ఆలోచనలను విర మించుకోవాలని, లేని పక్షంలో అందరిని వైవీయూ ద్రోహులుగా ప్రకటించి ఉద్య మిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పిడియస్ యు జిల్లా నాయకులు స్వరూప్ తేజ, నగర నాయకులు మనోజ్,జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.

ఫలితాలను విడుదల చేస్తున్న విసి, అధికారులు

## వైవీయూ సెమిస్టర్ పరీక్ష ఫలితాలు విడుదల

**ప్రజాశక్తి - కడప అర్బన్**

యోగి వేమన విశ్వవిద్యాలయం అనుబంధ సంస్థ ప్రొద్దుటూరులోని డాక్టర్ వైఎస్ఆర్ ఇంజినీరింగ్ కళాశాల బీటెక్, బీటెక్ (డిప్లమా) 8వ సెమిస్టర్ పరీక్ష ఫలితాలను విశ్వవిద్యాలయ విసి ఆచార్య చింతా సుధాకర్ విడుదల చేశారు. సోమవారం విశ్వవిద్యాలయంలోని తన ఛాంబర్‌లో వైవీయూ రిజిస్ట్రార్ ఆచార్య వై.పి.వెంకటసుబ్బయ్య, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ ఎన్.ఈశ్వర్ రెడ్డి, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య నాగరాజు, వైవీయూ ప్రిన్సిపల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి తో కలిసి పరీక్ష ఫలితాల గణాంకాలను పరిశీలించారు. ఫలితాల విడుదల అనంతరం ఆయన మాట్లాడుతూ బిటెక్, బిటెక్ (డిప్లమో) ఎనిమిదవ సెమిస్టర్ సివిల్ ఇంజినీరింగ్, కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ ఇంజినీరింగ్, మెకానికల్ ఇంజినీరింగ్, మెటలర్జీ అండ్ మెటీరియల్ టెక్నాలజీ పరీక్షల్లో 100 శాతం ఉత్తీర్ణత లభించిందన్నారు. గత నెలలో జరిగిన ఈ పరీక్షల ఫలితాలు త్వరితగతిన విడుదల చేసిన వైవీయూ పరీక్షల విభాగాన్ని విసి అభినందించారు. ఉత్తమ ఫలితాలు లభించిన సందర్భంగా వైవీయూ డాక్టర్ వైయస్సార్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ అధ్యాపకులను, విద్యార్థులను ప్రశంసించారు.

## దళితులపై వైసిపి నాయకుల దాడులు తగవు

**కడప అర్బన్ :** దళితులపై వైసిపి నాయకులు దాడులు చేయడం తగవని ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి బాబు అన్నారు. సోమవారం హరి టవర్స్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చింతకొమ్మదిన్నె మండలంలోని కొంత మంది దళిత నాయకులు, వైసిపి ఎస్‌సి సెల్ నాయకులు దళితులపై దాడులు జరిగాయని ఆరోపిస్తున్నారని, ఈ గొడవలు సార్వత్రిక ఎన్నికల్లో జరిగినవి కావని రాజకీయంగా చోటు చేసుకున్నాయని తెలిపారు. వైసిపి ప్రభుత్వంలో దళితులపై దౌర్జన్యాలు, మారణహోమాలు, దాడులు, సిరోముండనాలు, మాన, ప్రాణాలు తీసినప్పుడు మాట్లాడని ఈ దళిత నాయకులు ఇప్పుడు మాట్లాడుతుంటే దెయ్యాలు వేదాలు వర్ణించినట్లుగా ఉందని పేర్కొన్నారు. జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో దళితులకు చేసిన అన్యాయం గురించి మాట్లాడకుండా వైసిపి నాయకులు దౌర్జన్యాలు, దాడులు చేసినప్పుడు ఎక్కడ దాక్కున్నారని ప్రశ్నించారు. సమావేశంలో జిల్లా అధ్యక్షులు కొట్టం సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి వెంకట్ పాల్గొన్నారు.

## చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు

**కాశినాయన :** మండలంలోని అన్ని రాజకీయ పార్టీ నాయకులు, ప్రజలు చట్టాన్ని అతిక్రమించి, ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసు కుంటామని ఎస్ఐ అమర్‌నాథ్‌రెడ్డి, పోరుమామిళ్ల ఎస్ఐ మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఉదయం మండల కేంద్రమైన నరసాపురంలో నాకాబందీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ ఎన్నికల కౌంటింగ్ రోజు కానీ, ముందు రోజు కానీ ఎలాంటి పటాకులు కాల్చినా, ర్యాలీ నిర్వహించినా కఠిన చర్యలు ఒంటాయని హెచ్చరించారు. ఎంతటి వారైనా చట్టం తనపని చేసుక పోతుందని పేర్కొన్నారు. చట్టం ముందు అందరూ సమానమే అన్నారు. కార్యక్రమంలో కలసపాడు, పోరుమామిళ్ల, కాశినాయన పోలీసులు, నరసాపురం ప్రజలు పాల్గొన్నారు.

గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్ఐలు

తల్లిదండ్రులకు కరపత్రాలు అందజేస్తున్న హెచ్ఎం మహేశ్వరి

## కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు

**ప్రజాశక్తి - సింహాద్రిపురం**

కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల సదుపాయాలు ఉన్నాయని సింహాద్రిపురం జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు మహేశ్వరి పేర్కొన్నారు. సోమవారం మండలకేంద్రమైన సింహాద్రిపురంలో ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి ఫలితాల్లో సాధించిన వివరాలను ప్రజలకు వివరిస్తూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని ఉపాధ్యాయ బృందంతో ప్రచారం నిర్వహించారు. ఇటీవల విడుదలైన పదవ తరగతి ఫలితాల్లో జిల్లా స్థాయిలోనే సింహాద్రిపురం మండలం ఉండడం ఎంతో సంతోషించదగ్గ పరిణామమన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు.

## లింగ నిర్ధారణ నేరం : ఆర్డిఒ

**ప్రజాశక్తి - పులివెందుల టౌన్**

మాట్లాడుతున్న ఆర్డిఒ వెంకటేష్

గర్భంలో శిశువు ఉండగా లింగ నిర్ధారణ బహిర్గతం చేయడం చట్టరీత్యా నేరమని ఆర్డిఒ వెంకటేశ్ పేర్కొన్నారు. స్థానిక ఆర్డిఒ కార్యాలయంలో సోమవారం జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సబ్ డిస్ట్రిక్ట్ లెవెల్ మల్టీ మెంబర్ అప్రోప్రియేట్ అథారిటీ అడ్వైసర్ కమిటీ ప్రకారం గర్భంలోని శిశువు ఆడ అని తెలిసి బయటకు చెప్పడం చట్టరీత్యా నేరమని, ఆడ శిశువుకి జన్మనివ్వాలి, ఆడబిడ్డలను చదివించాలన్నారు. తద్వారా ఆడబిడ్డల అభివృద్ధి సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆర్డిఒ వివరిం చారు. సమావేశంలో భ్రూణ హత్యల నివారణకు స్కానింగ్ కేంద్రాలపై పూర్తి స్థాయి నిఘా ఉంచాలని సూచించారు. కళాజాత బృందాల ద్వారా ప్రజలకు అవ గాహన కార్యక్రమాలు చేపట్టాలని, గర్భస్రావానికి వాడే మాత్రలను డాక్టర్ సిఫా ర్సు లేకుండా మందులు ఇచ్చే దుకాణాలను, ఏజెన్సీలపై కఠిన చర్యలు చేప ట్టాలని సూచించారు. అంగన్వాడీ సిబ్బందిని కూడా కార్యక్రమంలో భాగ స్వా మ్యం చేయాలన్నారు. బేటీ బచావో.. భేటీ పడావో కార్యక్రమాలు చురుకుగా చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉప వైద్య ఆరోగ్య శాఖాధికారి ఖాజా మొ యిద్దీన్, ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీలత, డాక్టర్ వైయస్ఆర్ సర్వజన ఆసు పత్రి గైన కాలజస్ట్ డాక్టర్ అనన్య, రేడియాలాజిస్ట్ డాక్టర్ షాలిని, నగరిగుట్ట, బాకరాపురం పట్టణ ప్రాథమిక వైద్యశాలల వైద్యులు డాక్టర్ స్నేహ ప్రత్యూష, డాక్టర్ శాంతి కుమార్, స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు పాల్గొన్నారు.

# క్రైం కార్నర్

## లారీ ఢీకొని మహిళ మృతి

**ప్రజాశక్తి - ఎర్రగుంట్ల**

ఎర్రగుంట్ల నగర పంచాయతీ పరిధిలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా సోమవారం లారీ ఢీకొన్న ఘటనలో దిల్షాద్ (48) అనే మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. పోలీసుల వివరాల మేరకు.. పట్టణంలోని రాణివనంలో నివాసం ఉంటున్న దిల్షాద్ తన కుమారునితో కలిసి ద్విచక్ర వాహనంలో కడప పట్టణంలోని తన బంధువుల ఇంటికి వెళుతున్నట్లు తెలిపారు. ఆ క్రమంలో కడప రోడ్డులోని ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా దిల్షాద్ ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని టిఎన్ 23 బికె 5103 నెంబర్ గల లారీ వెనుక నుండి బలంగా ఢీ కొంది. ద్విచక్ర వాహనంలో ఉన్న దిల్షాద్, ఆమె కుమారుడు కిందపడ్డారు. వెనుక నుండి వస్తున్న లారీ దిల్షాద్ మీదుగా వెళ్లడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలికి భర్త, కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. భర్త ఫక్రుద్దీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

**ట్రాఫిక్ సమస్యే ప్రధాన కారణం**

పట్టణంలో వాహనాలు ఎక్కువ కావడంతో రోజురోజుకూ ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతోంది. అంతేకాక వాహనాలు ఎక్కడపడితే అక్కడ పార్కింగ్ చేయడం, దుకాణదారులు ఫుట్పాత్లను ఆక్రమించడంతో ట్రాఫిక్ సమస్య జఠిలంగా మారింది. ప్రజలు రోడ్లపై నడిచే పరిస్థితి ఏర్పడింది. బస్టాండ్ ఎదురుగా ప్యాసింజర్ ఆటోలు, జీపులు రోడ్లపైనే ఆపి ప్రయాణికుల కోసం వేచి చూడడం, చిరు వ్యాపారులు రోడ్లపైనే గంపలు, తోపుడు బండ్లు పెట్టడంతో ట్రాఫిక్ సమస్య మరింత అధికమవుతోంది. ఈ సమస్యను తీర్చడంలో పోలీసులు విఫలమయ్యారని పలువురు పేర్కొంటున్నారు. ఫుట్పాత్ల ఆక్రమణలు తొలగించి పాదాచారులు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని పలుమార్లు మున్సిపల్ కమిషనర్కు ఫిర్యాదు చేసినా, ఇప్పటివరకు పట్టించుకోలేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

## విద్యుదాఘాతంతో బాలుడు..

**ప్రజాశక్తి - వేంపల్లె**

మృతి చెందిన మనోజ్

స్థానిక కడప రోడ్డులో విద్యుత్ షార్ట్ సర్క్యూట్తో మనోజ్ (13) అనే బాలుడు మృతి చెందాడు. వేంపల్లె ఎస్సీ కాలనీకి చెందిన మనోజ్ కడప రోడ్డులో ఉన్న వాటర్ సర్వీసింగ్ సెంటర్లో పని చేస్తున్నాడు. సోమవారం కారుకు నీటితో సర్వీసింగ్ చేస్తుండగా మోటర్పై ప్రమాదవశాత్తూ నీరు పడడంతో మనోజ్ విద్యుత్ షాక్కు గురయ్యాడు. మనోజ్ను హుటాహుటిన వేంపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే బాలుడు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మనోజ్ కుటుంబ పోషణ కోసం వాటర్ సర్వీసింగ్ సెంటర్లో పని చేస్తున్నట్లు మృతుడి బంధువులు తెలిపారు. తన కుమారుడు మృతి పట్ల తల్లి వెంకటసుబ్బమ్మ కన్నీరు మున్నీరుగా విలపించింది. ఏడాది కితం తండ్రి గంగులయ్య గుండెపోటుతో మృతి చెందాడు. ఎస్సీ కాలనీలో విషాదఛాయలు అలము కున్నాయి. మృతికి గల కారణాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

## యాచకురాలి మృతదేహానికి అంత్యక్రియలు

**ప్రజాశక్తి - ప్రొద్దుటూరు**

ప్రొద్దుటూరు ప్రభుత్వాసుపత్రిలో గుర్తుతెలియని యాచకురాలి (35) మృతదేహానికి స్థానిక మే ఐ హెల్ప్ యూ ఫౌండేషన్ నిర్వాహకులు సోమవారం సాయంత్రం అంత్యక్రియలు చేశారు. ప్రొద్దుటూరు ప్రభుత్వాసుపత్రిలో యాచకురాలు మృతి చెందగా అంత్యక్రియలు చేసేందుకు సంబంధీకులెవరూ రాకపోవడంతో యర్రగుంట్ల పోలీస్ సిబ్బంది ఫోన్ ద్వారా ఫౌండేషన్ నిర్వాహకులకు సమాచారం అందించారు. స్పందించిన ఫౌండేషన్ వ్యవస్థాపకుడు లక్షణ్మోరే తన సిబ్బందితో హిందూ సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా లక్షణ్ మాట్లాడుతూ తమ ఆధ్వర్యంలో ప్రొద్దుటూరులో శ్రీ అమ్మశరణాలయం నిర్వహిస్తున్నామని, ఇందులోని వృద్ధులకు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో టౌన్ ప్రెసిడెంట్ సుబహాన్, పోలీస్ సిబ్బంది ఫిరోజ్ యాదవ్ పాల్గొన్నారు.

# అధ్వానం.. అనుసంధాన రోడ్లు

**ప్రజాశక్తి - చాపాడు**

జడ్జిగారికొట్టాలు వద్ద అధ్వానంగా ఉన్న రోడ్డు

కడప-కర్నూలు ప్రధాన రహదారికి అను సంధానంగా ఉన్న రోడ్లు పలుచోట్ల అధ్వానంగా ఉన్నాయి. ముఖ్యంగా మైదుకూరు, సర్వాయపల్లి మసీదు రోడ్డు నుండి హైవేకు వచ్చే ప్రదేశం చాలా అధ్వానంగా ఉంది. రోడ్డు మొత్తం గుంతలమయం కావడంతో ప్రయా ణికులు హైవే పైకి రావాలంటే ఇబ్బందికరంగా మారింది. గత నెలలో పడిన వర్షానికి ఈ మార్గం మరీ దారుణంగా తయారైంది. చాపాడు మండలం పరిధిలోని ద్వారకా నగరం, సిద్ధారెడ్డి పల్లి గ్రామాలకు వెళ్లే అను సంధాన రోడ్లు కూడా అస్త వ్యస్తంగా ఉన్నాయి. మున్సిపాలిటీ పరిధిలో హైవే రోడ్డు నిర్మించిన తర్వాత అనుసంధాన రోడ్లు పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. అనుసంధాన రోడ్డు వద్ద లైటింగ్ ఏర్పాటు చేస్తే ప్రయాణికులకు ఉపయోగకరంగా ఉంటుంది. మైదుకూరు-ప్రొద్దుటూరు ప్రధాన రహదారి నుంచి కడప-కర్నూలు ప్రధాన రహదారికి ఈ మధ్య కాలంలోనే అప్రోచ్ రోడ్లు ఏర్పాటు చేశారు. గతంలో ఈ మార్గంలో ప్రయాణికులు చాలా ఇబ్బం దులు పడేవారు. ఈ ప్రాంతంలో ప్రస్తుతం సూచిక బోర్డులు ఏర్పాటు చేయాల్సి ఉంది. ప్రొద్దుటూరు రోడ్డు బ్రిడ్జి వద్ద సూచిక బోర్డు లేక ప్రమాదాలు జరుగుతున్నాయి. కడప-కర్నూలు ప్రధాన రహదారి నుండి అప్రోచ్ రోడ్లు, సూచిక బోర్డులు, లైటింగ్ వ్యవస్థను అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

# పండిట్ నెహ్రూ గొప్ప దార్శనికుడు

నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న తులసిరెడ్డి, నాయకులు

**ప్రజాశక్తి - వేంపల్లె**

భారత రత్న, భారత తొలి ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ గొప్ప దార్శనికుడని పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం నెహ్రూ 60వ వర్ధంతిని ఆ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ నెహ్రూ అగర్భ శ్రీమంతుడిగా పుట్టినప్పటికీ దేశ స్వాతంత్ర్యం కోసం అల్మారా, ఆలీఘర్, డెహ్రాడూన్ తదితర జైళ్లల్లో దుర్భర జీవితాన్ని గడిపారన్నారు. తొలి ప్రధానిగా 17ఏళ్లపాటు దేశాన్ని పరిపాలించిన పరిపాలనాదక్షుడు, నవ నిర్మాత నెహ్రూ అని కొనియాడారు. స్వతంత్రం వచ్చే నాటికి దేశం వ్యవసాయం, పారిశ్రామిక, విద్య, వైద్యం, విద్యుత్, రవాణా, అణు సమస్త రంగాల్లో ఎంతో వెనుకబడి ఉండేదన్నారు. నెహ్రూ దార్శనికత వల్ల దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని వివరించారు. సాగునీటి ప్రాజెక్టులు, కర్మాగారాలను ఆధునిక దేవాలయాలుగా వర్ణించిన దార్శనికుడు అన్నారు. నెహ్రూ ప్రతిష్టను తగ్గించాలని బిజెపి ప్రయత్నించడం శోచనీయమన్నారు. కందుకూరి వీరేశలింగం పంతులు 105వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి కూడా ఘనంగా నివాళులర్పించారు. వీరేశలింగం పంతులు తెలుగు భాషోద్ధారకుడని తులసిరెడ్డి కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాజా, ఉత్తన్న, రామకృష్ణ, అమర్, బాలం సుబ్బరాయుడు, వేమయ్య, వినయ్, శివ, బాషా (మాస్) పాల్గొన్నారు.

# గోవింద నామస్మరణతో మార్మోగిన జమ్మలమడుగు

### వైభవంగా రథోత్సవం - అలరించిన కోలాటం, చెక్కభజన - భారీగా అన్నదానాలు

**ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్**

శ్రీనారాపుర వెంకటేశ్వర స్వామి రథోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో ఈనెల 20 నుంచి 30వ తేదీ వరకు శ్రీనారాపుర వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను నిర్వహించారు. ఇందులో భాగంగా సోమవారం జమ్మలమడుగు పట్టణం వేలాదిమంది భక్తులతో శ్రీదేవి-భూదేవి సమేతులై శ్రీనారాపుర వేంకటేశ్వర స్వామి పురవీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. కన్నుల పండువలా రథోత్సవాన్ని నిర్వహించారు. రథోత్సవంలో శ్రీ వేంకటేశ్వర స్వామి వేషధారణలో భక్తుడు ఆకట్టుకున్నాడు. రథో త్సవం సందర్భంగా భక్తులు గోవింద నామ స్మరణతో పరవశించి పోయారు. జమ్మలమడుగు గోవింద నామస్మరణతో మార్మోగింది. రథో త్సవాన్ని చూసేందుకు భక్తులు జమ్మల మడుగు పట్టణం నుంచేకాక జిల్లా నలుమూలల నుంచి, చుట్టుపక్కల గ్రామాల నుంచి వేలాదిగా తరలి వచ్చారు. శ్రీవారి రథం ఉదయం దేవాల యం వద్ద నుంచి తేరురోడ్డు, తాడిపత్రి రోడ్డు, స్టేట్ బ్యాంక్ మీదుగా పాత బస్టాండు కూడలిలోకి చేరుకోవడంతో ఒక్కసారిగా జమ్మలమడుగు భక్తులతో జన సంద్రంగా మారింది. అక్కడి నుంచి మార్కెట్ వీధి, ఆంజనేయ స్వామి దేవాలయం వరకు మధ్యాహ్నం చేరుకుంది. అక్కడి నుంచి మధ్యాహ్నం మూడు గంటలకు రథం ప్రారంభమై మెయిన్ బజారు, కన్యకా పరమేశ్వర స్వామి వీధి, అమ్మవారి శాల, పలగాడి మోటు నుంచి తిరిగి ఆలయ ప్రాంగణంలోకి సాయంత్రానికి చేరుకుంది. రథోత్సవం ప్రారంభం నుంచి పుర వీధులను నీటితో తడుపుతూ స్వామి వారిని ఊరేగించారు. భక్తులకు ఎక్కడికక్కడ మజ్జిగ ప్యాకెట్లు, రస్నా, పానకం దుకాణాల ముందర, ట్రాక్టర్లతో అందించారు. చెక్కభజన, కోలాటం ఎంతగానో ఆకట్టుకున్నాయి. శ్రీవారి సేవా సమితి ఆధ్వర్యంలో అలంకార్ ఫంక్షన్ హాల్, తహశీల్దార్ కార్యాలయ పరిసరాల్లో అన్నదానం నిర్వహించారు. డిఎస్పి టిడి యశ్వంత్ భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. 144 సెక్షన్ అమల్లో ఉన్న ప్పటికీ భక్తులకు ఇబ్బంది కలిగించకుండా పోలీ సులు తగు చర్యలు తీసుకున్నారు. గోవింద నామస్మరణతో రథోత్సవం ఘనంగా ముగిసింది.

కన్నుల పండువగా సాగుతున్న రథోత్సవం

**గోవిందా ఏమిటీ తతంగం**

ప్రతి ఏడాది నారాపుర స్వామి తిరుణాల అంటే కేవలం ప్రజలకు ఆనందమేకాక శ్రీవారికి కూడా ఆదాయం సమకూరేది. ఈ ఏడాది టిటిడికి ఆదాయం లేకుండా పోయింది. కారణం ఎలక్షన్ కోడ్ ఉండడమే. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు డిఎస్పి, ఇతర ఉన్నత అదికారుల సహకారంతో దుకాణాలు, ఎగ్జిబిషన్కు వేలంపాటను ఆపేశారు. అయినప్పటికీ కొంతమంది లెక్క చేయకుండా దేవాలయం పక్కనే ఎగ్జి బిషన్ ఏర్పాటు చేయడంతో పోలీసులు భారీగా మోహరించాల్సి వచ్చింది. ఏ చిన్న సమస్య తలెత్తిన పోలీస్ యంత్రాంగం భారీ మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుంది.

స్వామి వారి వేషధారణలో భక్తుడు

# కార్మికుల అదనపు విధులకు వేతనం చెల్లించాలి

**ప్రజాశక్తి - ప్రొద్దుటూరు**

అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా మున్సిపల్ కార్మికులు అదనపు విధులు నిర్వహించారని, ఆ మేరకు వారికి డబ్బులు చెల్లించాలని మున్సిపల్ కార్మికుల సంక్షేమ సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంటి, సాల్మన్ కోరారు. ఆ మేరకు సోమవారం మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చంటి, సాల్మన్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు అదనంగా పాలిటెక్నిక్ కళాశాలలో ఎలక్షన్ బూత్ల వద్ద డ్యూటీలు వేశారన్నారు. అలాగే గత కరోనా సందర్భంగా తీసుకున్న కార్మికులకు ఒక నెల వేతనం బకాయి ఉందన్నారు. ఈ వేతనాన్ని కూడా చెల్లించాలని వారు కోరారు. ఇందుకు మున్సిపల్ కమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ రవికుమార్, లంక రవి, ఉపాధ్యక్షులు ప్రమీలమ్మ, గుర్రమ్మ, రమాదేవి, నీతమ్మ పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్కు వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

# కౌంటింగ్ రోజున జాగ్రత్తలు పాటించాలి

అల్లాడుపల్లెలో ప్రజలతో మాట్లాడుతున్న ఎస్ఐ కొండారెడ్డి

**ప్రజాశక్తి - చాపాడు** : సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా ప్రజలందరూ పోలీసులు సూచించిన విధంగా జాగ్రత్తలు పాటించాలని ఎస్ఐ కొండారెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మండల పరిధిలోని పలు గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ కౌంటింగ్ సందర్భంగా 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. గుంపులుగా ఉండడం, బాణాసంచా పేల్చడం, ఊరేగింపులు వంటివి నిషేధమన్నారు. నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. క్రిమినల్ కేసులు నమోదు చేసి రౌడీషీటర్గా నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో పోలీసులు, ప్రజలు పాల్గొన్నారు.

**పాస్‌పోర్ట్ పోయినది**

వైఎస్ఆర్ కడప జిల్లా, బ్రహ్మంగారిమట్టం మండలం, T. చౌదరవారి పల్లి గ్రామం, డోర్ నెం 1-29 లెక్కల రమణారెడ్డి కుమారుడు లెక్కల రమణారెడ్డి గురిజాలలో వివాహం చేసుకున్నాడు. 21-May-2024న కొన్ని పనుల నిమిత్తము గురిజాల నుండి సింహాద్రిపురంకి వెళ్తుండగా మార్గ మధ్యలో పాస్‌పోర్ట్ కలిగిన బ్యాగ్ పోయినది. ఒరిజినల్ పాస్ పోర్ట్ నెంబర్: **J9835344** ఎవరికైన పాస్ పోర్ట్ దొరికినచో 7036165566 మొబైల్ నెంబర్ కి తెలుపగలరు.

మాట్లాడుతున్న సత్యనారాయణ

## 30న సిఐటియు ఆవిర్భావ దినోత్సవం

**ప్రజాశక్తి - ప్రొద్దుటూరు**

ఈ నెల 30న గురువారం సిఐటియు 54వ ఆవిర్భావదినోత్సవాన్ని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి సత్యనారాయణ కోరారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గురువారం ఉదయం 10 గంటలకు సిఐటియు సభ్యులందరూ ప్రొద్దుటూరు పాతబస్టాండ్ వద్ద ఉన్న సిఐటియు కార్యాలయానికి చేరుకోవాలని సూచించారు. సిఐటియు నాయకత్వం ప్రతి కార్మికుడ్ని ఈ కార్యక్రమంలో పాల్గొనేలా చూడాలని కోరారు. సమస్య ఏదైనా పరిష్కారం దిశగా ఆలోచిస్తున్న సిఐటియు జెండా ఆవిష్కరణ జయప్రదంగా జరపాలని సత్యనారాయణ కోరారు. సమావేశంలో సిఐటియు పట్టణ కార్యదర్శి విజయకుమార్, ఆటోయూనియన్ కార్యదర్శి శేఖర్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్, తహశీల్దార్

## ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి

**ప్రజాశక్తి - ఎర్రగుంట్ల**

స్థానిక నగర పంచాయతీ పరిధిలోని జగనన్న ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని అధికారులు సూచించారు. మున్సిపల్ కమిషనర్ రామకృష్ణయ్య, తహశీల్దార్ సౌజన్య లక్ష్మి ఆధ్వర్యంలో సోమవారం నగర పంచాయతీ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న ఇళ్ల నిర్మాణాలు మందకోడిగా సాగుతున్నాయని తెలిపారు. ప్రభుత్వం నుంచి లబ్ధిదారులకు వచ్చిన బిల్లులను కాంట్రాక్టర్లకు చెల్లించేలా సచివాలయం పరిధిలోని అమినిటీస్ వారికి తెలియజేయాలని తెలిపారు. సమావేశంలో హౌసింగ్ ఎఇ రామకృష్ణ, వర్క్ ఇన్‌స్పెక్టర్ బాషా, మెప్మా సిఒ వసంత్, సచివాలయ అమినిటీస్, అడ్మిన్ సెక్రటరీలు, వెల్ఫేర్ సెక్రటరీలు, వీఆర్వోలు, ఆర్పీలు పాల్గొన్నారు.

వంట ఏజెన్సీల సమావేశంలో మాట్లాడుతున్న ఎంఇఒ-2 రవికుమార్

## విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలి

**ప్రజాశక్తి - చక్రాయిపేట**

ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం రుచికరంగా వడ్డించాలని ఎంఇఒ-2 టివి రవికుమార్ సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం వంట ఏజెన్సీలకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని 62 పాఠశాలల్లో పనిచేస్తున్న వంట మాస్టర్లకు తిరుపతిలోని తాజ్ హోటల్ వంట నిపుణుల సహకారంతో వీడియోలను వంట మాస్టర్లకు ప్రదర్శించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ జూన్ 12న పాఠశాలలు ప్రారంభమవుతాయన్నారు. అనంతరం వంట పోటీల్లో గెలుపొందిన ముగ్గురికి ఎంఇఒ-2 రవికుమార బహుమతులను అందజేశారు. నాగలగట్టుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.సంజీవ్‌కుమార్‌కు, చక్రాయపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు ఎం వెంకట రవీంద్రబాబుకు, చిలేకాంపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పివి రమణకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో మండలంలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వంట ఏజెన్సీలు, కో-ఆర్డినేటర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

## 'సీమ' ప్రజలకు సేవలందించిన మొదటి కలెక్టర్ థామస్ మన్రో

**ప్రజాశక్తి -కడప అర్బన్**

జిల్లా ప్రజలకే కాకుండా, రాయల సీమ ప్రాంతానికి సేవలందించిన గొప్ప వ్యక్తి, మొదటి కలెక్టర్ థామస్ మన్రో అని వరల్డ్ పీస్ అంబాసిడర్ ఆఫ్ క్రైస్ట్, సర్ థామస్ మన్రో సేవా సమితి చైర్మన్ బిషప్ డాక్టర్ కె. సామ్యూల్ బాబు అన్నారు. సోమవారం ఆర్కె నగర్ లోని షాలోమ్ ప్రార్థనా మందిరం ఆవరణలో మన్రో జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బిషప్ మాట్లాడుతూ 1800 సంవత్సరం నుంచి 1807 వరకు థామస్ మన్రో కడప జిల్లా మొదటి కలెక్టర్‌గా పని చేసి జిల్లా ప్రజలకు అత్యున్నత సేవలందించిన మహనీ యుడని కొనియాడారు. తెల్ల దొరలలో తెలుగు ప్రజలు మరువురాని అగ్రగణ్యుడు సర్ థామస్ మన్రో అని చెప్పారు. పేదల ప్రజలను దోచుకుంటున్న పాలెగాళ్లను అణచి వేసి భూమి సిస్తును రద్దు చేసి పేదలకు భూమి పై హక్కు కల్పించిన మహోన్నతుడు మన్రో అన్నారు. కార్యక్రమంలో రెవ పాస్టర్ స్వర్జన్ రత్న కుమార్, హెబ్సిబా, ప్రణూష , స్పందన, చర్చి సభ్యులు పాల్గొన్నారు.

**IN THE COURT OF Addl. SENIOR CIVIL JUDGE, KADAPA**

**O.S.No. 4/2023**

Sambeta Lakhsmi Kalpana, W/o Mohan Babu, aged 39 years, House wife, D.No.37/1175-10, Vidya Nagar, Chinnachowk, Kadapa Dist.
...వాది

Vs

Devarasetty Indumathi, W/o Reddaiah, aged 30 years, D.No.75/27, Vijayadurga Colony, Kadapa, Kadapa Dist.
...ప్రతివాది

ప్రకటన

ఇందుమూలంగా తెలియజేయడం ఏమనగా వాది ప్రతివాది పైన దావా దాఖలు చేసియున్నది. సదరు దావా రాజశ్రీ పై కోర్టులో 01.07.2024 వాయిదా వున్నది. కావున ప్రతివాది అయిన మీరు సదరు కోర్టు నందు 01.07.2024న ఉదయం 10.30 గం॥ హాజరు అయి మీ అభ్యంతరములు తెలుపుకోవలసినది. లేని ఎడల మీకు పరోక్షముగా తీర్మానించబడును అని తెలియజేయడం అయినది.

కె.మస్తానయ్య
వాది తరపున వకీలు.